క్లుప్తంగా

ప్రశాంత్‌రెడ్డి గెలవాలని పూజలు



వేల్పూర్: రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మూడో సారి ఎమ్మెల్యేగా గెలవాలని కోరుతూ వేల్పూర్‌కు చెందిన జిల్లా ఆర్‌టీఏ సభ్యుడు రేగుల్లరాములు శుక్రవారం కొండగట్టు ఆంజనేజస్వామి ఆలయంలో పూజలు చేశారు. మూడో సారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని వేడుకున్నారు.

రాష్ట్రస్థాయి నృత్యోత్సవంలో ప్రతిభ



నిజామాబాద్ సిటీ: బెంగళూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి నృత్యోత్సవంలో నిజామాబాద్ విజయ్ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక దామోదరుడికి సమర్పించిన నృత్యనీరాజన కార్యక్రమం రవీంద్ర కళాక్షేత్రంలో వివిధ జిల్లాలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ పాఠశాలకు చెందిన జి వైభవికృతి, సీహెచ్ సాన్వి పాల్గొని ప్రదర్శన ఇచ్చారు. విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత, కరస్పాండెంట్ వి ప్రభాదేవి విద్యార్థినులను అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఇలేందర్ శుక్రవారం రూరల్ కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఇలేందర్‌కు కండువా కప్పి ఆయన ఆహ్వానించారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ రూరల్‌లో కాంగ్రెస్ పార్టీ కోసం నెల రోజుల పాటు శ్రమించిన ప్రతి కార్యకర్త, నాయకుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్‌కు ఓటేసిన ఓటర్లకు భూపతిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు గుడి ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాకేష్, నారాయణరెడ్డి, ఖలీమ్, చిన్నారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



సిరికొండ: మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ అరవింద్, సీహెచ్‌వో అనంతరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పడగల్‌లో సీఎస్‌ఐ చర్చి వార్షికోత్సవం





వేల్పూర్: వేల్పూర్ మండలం పడగల్‌లోని సీఎస్ ఐ చర్చి నాలుగో వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. వార్షికోత్సవ ప్రార్థనల కోసం చర్చిని అందంగా ముస్తాబు చేశారు. చిన్నారులు, పురుషులు, మహిళలు ప్రత్యేక గీతాలు ఆలపించారు. పాస్టర్ రెవరెండ్ ప్రేమ్ రాజ్ దైవసందేశం వినిపించారు. సంఘ పెద్దలు టి సందీప్, జే దయానంద్, జి వసంత్, స్త్రీల మైత్రి సభ్యులు తబిత ప్రేమ్‌రాజ్, ప్రభావతి, అమూల్య, వర్ష, లావణ్య, లలిత, స్రవంతి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

భూపతిరెడ్డిని కలిసిన నాయకులు

నిజామాబాద్‌రూరల్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డిని మారుతినగర్‌లోని నివాసంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రాలు, గ్రామల వారీగా ఓటింగ్ శాతం, పోలింగ్ సరళిపై చర్చించారు. భూపతిరెడ్డి మాట్లాడు తూ.. కాంగ్రెస్ పార్టీ రూరల్‌లో విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్ర జలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టనున్నారని పేర్కొన్నారు.

లాభాల్లో వాటా ఇస్తామని మోసం

- సంకల్ప్ మార్ట్ సంస్థ నిర్వాకం
- సుమారు రూ.50లక్షల వరకు వసూలు
- తమ సొమ్ము కోసం డిపాజిట్‌దారుల నిరీక్షణ

మోర్తాడ్: నిత్యావసర సరుకులు, ఎర్రచందనం మొక్కల వ్యాపారంలో పెట్టుబడులు పెడితే లాభాల్లో వాటా పొందవచ్చని, ఉన్నంతలో మనమూ కూడా ఆర్థికంగా ఎదగవచ్చని నమ్మించి భారీ మొత్తంలో డిపాజిట్‌లు సేకరించిన సంకల్ప్ మార్ట్ సంస్థ బోర్డు తిప్పేసింది. రూ.వెయ్యి నుంచి ఎంత మొత్తమైనా పెట్టుబడి పెడితే రోజువారిగా కొంత ఆదాయం డిపాజిట్‌దారుల ఖాతాల్లో జమ చేస్తామని నమ్మించిన సంస్థ ప్రతినిధులు ఇప్పుడు ముఖం చాటేయడంతో సదరు సంస్థలో పెట్టుబడి పెట్టినవారు లబోదిబోమంటున్నారు. ఏడాదిన్నర కాలంగా తమ సొమ్ము కోసం డిపాజిట్‌దారులు నిరీక్షిస్తున్నారు.

విజయవాడ కేంద్రంగా పని చేస్తున్న సంకల్ప్ మార్ట్ సంస్థకు మోర్తాడ్ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రతినిధులుగా వ్యవహరించారు. దాదాపు నాలుగు వందల మందితో రూ.50లక్షల వరకు డిపాజిట్ చేయించారు. సంకల్ప్ మార్ట్ సంస్థలో పెట్టుబడి పెట్టినవారికి ఆన్‌లైన్‌లో లాగిన్ కావడానికి ఐడీ, పాస్‌వర్డ్ కూడా క్రియేట్ చేసి ఇచ్చారు. కొంత మందికి మొదట్లో రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు లాభాలు వచ్చాయని నమ్మించి ఖాతాల్లో జమ చేయించారు. ఇలా లాభాలు పొందినవారి పేర్లు చెబుతూ తమ ఖాతాదారుల సంఖ్యను భారీగా పెంచుకున్నారు. కొన్ని రోజులపాటు సంస్థ ఆన్‌లైన్ లాగింగ్ పని చేయగా గడచిన నెలాఖరులో లాగిన్ పనిచేయడం స్తంభించిపోయింది. ఆన్‌లైన్‌లో లాగిన్ పని చేయకపోవడంతో పెట్టుబడి పెట్టినవారికి అనుమానం వచ్చి సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. సంస్థ యజమానిగా చలామని అవుతున్న వ్యక్తి అరెస్టు అయ్యాడని అతను బైలుపై బయటకు రాగానే సంస్థ కార్యకలాపాలు యధావిధిగా సాగుతాయని ప్రతినిధులు నమ్మిస్తున్నారు. డిపాజిట్లు చేసిన వారు తమ సొమ్ము వాపసు చేయాలని సంస్థ ప్రతినిధులపై వత్తిడి తీసుకు వచ్చినా ప్రయోజనం లేకపోయింది.



సంకల్ప్ మార్ట్ సంస్థ ముద్రించిన పోస్టర్

ప్రశ్నించిన వారు 'రిమూవ్'

సంకల్ప్ మార్ట్ సంస్థలో చేరినవారితో ప్రతినిధులు ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. ఈ గ్రూపులో సంస్థ కార్యకలాపాలు ఎందుకు నిలిచిపోయాయి, తమ సొమ్మును ఎవరు వాపసు ఇస్తారు, తమను చేర్పించిన ప్రతినిధులే బాధ్యత వహించాలని కొందరు సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. ఇలా ప్రశ్నిస్తున్న వ్యక్తులను గ్రూప్ నుంచి సంస్థ ప్రతినిధులు తొలగిస్తున్నారని బాధితులు వాపోయారు. మరి కొందరు మాత్రం ముందు ముందు ఏమైనా సమాచారం రావచ్చనే ఉద్దేశంతో వాట్సాప్ గ్రూప్‌లో ఉండిపోయారు. ఇది ఇలా ఉండగా విజయవాడ కేంద్రంగా ఏర్పడిన సంస్థ ఎలాంటిదో యజమానులు ఎలాంటివారో తమకు తెలియదని బాధితులు చెబుతున్నారు. తమకు సదరు సంస్థపై నమ్మకం కలిగించి పెట్టుబడి పెట్టించినవారే డబ్బులు వాపసు ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్మూర్‌లో తగ్గిన పోలింగ్ శాతం

- 2018లో 78.45 శాతం.. ప్రస్తుతం 76.02 శాతం నమోదు



ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గంలో గత ఎన్నికలతో పోలిస్తే ఈ సారి పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. ఓటర్ల సంఖ్య పెరిగినప్పటికీ పోలింగ్ శాతం మాత్రం పడిపోయింది. 2018 ఎన్నికలకు 2023 ఎన్నికలతో పోలిస్తే ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో 32,771 మంది కొత్త ఓటర్లు నమోదయ్యారు. అయితే పోలింగ్ శాతం తగ్గడంపై రాజకీయ విశ్లేషకులు పలు కారణాలను చర్చిస్తున్నారు. మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నా పురుషులు మాత్రం ఆసక్తి చూపకపోవడంతో ఓటింగ్ తగ్గిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

2018 ఎన్నికల్లో..

గత ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో 211 పోలింగ్ కేంద్రాల్లో 1,39,148 ఓట్లు పోల్ కాగా 78.45 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 1,77,446 మంది ఓటర్లు ఉండగా పురుషులు 83,388 మంది, మహిళలు 94,052 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. వీరిలో మొత్తం 1,39,148 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా అందులో పురుషులు 59,906, మహిళలు 79,242 మంది ఉన్నారు. దీంతో 78.45 శాతం పోలింగ్ నమోదైంది.

2023 ఎన్నికల్లో...

నియోజకవర్గంలో ఈ ఎన్నికల్లో 1,59,804 ఓట్లు పోల్ కాగా 76.02 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం ఓటర్ల సంఖ్య 2,10,217 కాగా అందులో పురుషులు 98,274 మంది, మహిళలు 1,11,937 మంది, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 69,508 మంది పురుషులు, 90,296 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆరుగురు ఇతరులు ఉండగా వారు ఓటు వేయలేదు.

వర్షం.. అపార నష్టం

రెంజల్: మూడు రోజుల కిందట కురిసిన వర్షం మండలంలోని దూపల్లి గ్రామస్తులకు తీవ్ర నష్టం మిగిల్చింది. గాలివానకు ట్రాన్స్‌ఫార్మర్‌లు, విద్యుత్ స్తంభాలు విరిగి పడటంతో గ్రామంలో కరెంట్ సమస్య ఎదుర్కొంటున్నారు. వర్ష బీభత్సంతో గ్రామం చుట్టుపక్కల రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్లు నేలవాలయి. రెంజల్-దూపల్లి గ్రామాల మధ్య దండిగుట్ట శివారులో రోడ్డుపై భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. మూడు రోజులు గడుస్తున్నా చెట్టును తొలగించకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు గ్రామంలో కరెంటు సమస్య వెంటాడుతోంది. సింగిల్ ఫేస్‌ను మాత్రమే సరాఫరా చేస్తున్నారు. భారీ వర్షానికి గ్రామంలోని పలువురి రేకుల షెడ్లు ధ్వంసమయ్యాయి. దూపల్లి నుంచి దూపల్లి గేట్ వరకు గల రోడ్డుకు రెండు పక్కలా పెంచిన చెట్లు పొలాల్లో పడిపోయాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే రైతుకు చెందిన ఆరు ఎకరాల చెరుకుతోట నేలవాలింది.



దూపల్లి శివారులో విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



దండిగుట్ట శివారులో రోడ్డుపై చెట్టు పడటంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దోమల నివారణకు చర్యలు



దోమల నివారణ మందు పిచికారి చేస్తున్న సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సాయి మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాల్లో నీటి నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పలు చోట్ల నిలు వ ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ఆరోగ్య కార్యకర్త ఆనంద్, ఆశా కార్యకర్తలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కిష్టయ్య వర్ధంతి

ఎడపల్లి: మండలంలోని సాటాపూర్ గేట్ వద్ద శుక్రవారం తెలంగాణ ఉద్యమంలో అమరుడైన పోలీసు కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు పిస్క గంగాప్రసాద్ మాట్లాడుతూ కిష్టయ్య త్యాగం ఉద్యమానికి ఊపిరి అయ్యిందని పేర్కొన్నారు. ముదిరాజ్ మహసభ నాయకులు ఆంజనేయులు, సున్నపు ఒడ్డెన్న, రాజ్‌కుమార్, మనోజ్, రవి, గంగాధర్, మల్లేశం, నెల్లి రాజు, రామ్‌చందర్, కృష్ణ, భాస్కర్, పిట్ల పోచయ్య, అబ్బులు, నర్సింలు, స్వామి పాల్గొన్నారు.

ఇందల్వాయి: తెలంగాణ అమరవీరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతిని ఇందల్వాయి మండల ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. లింగాపూర్ స్టేజీ వద్ద ఉన్న కిష్టయ్య విగ్రహానికి ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇమ్మడి గోపి పూలమాల వేసి ని వాళులు అర్పించారు. ముదిరాజ్‌లు ఐక్యతతో రాజకీయ సాధికారత సాధించాలని అన్నారు.



లింగాపూర్ స్టేజీ వద్ద కిష్టయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



సాటాపూర్ గేట్ వద్ద కిష్టయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పాఠశాలలో సమస్యల తిష్ట

- 300 మంది విద్యార్థులకు ఒకే మూత్రశాల
- బడి ఆవరణలోనే మురుగు నీరు నిల్వ
- తిర్మన్‌పల్లి పాఠశాలలో విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



నిజామాబాద్‌రూరల్: పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో దాదాపు 300 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలల్లో తాగునీరు, డ్రైయినేజీ లేదు. 300 మంది విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులకు ఒకే మూత్రశాల ఉంది. అదే విధంగా పాఠశాల భవనం పురాతనమైనది కావడంతో తరగతి గదుల్లో ఉన్న స్లాబ్ పెచ్చులు ఎప్పుడు కిందపడిపోతాయో తెలియని పరిస్థితి ఉంది. అదే విధంగా తాగు నీటి ట్యాంక్ వద్ద అపరిశుభ్రంగా నెలకొంది. గతంలో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద పాఠశాలలో మూత్రశాలలు నిర్మించేందుకు చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అదేవిధంగా పాఠశాల ఆవరణలో ఉన్న పల్లెప్రకృతి వనం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. డ్రైయినేజీ వ్యవస్థ లేక మురుగు నీరు పాఠశాలలోనే నిలుస్తోంది. అధికారులు స్పందించి పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, గ్రామస్తులు కోరుతున్నారు.



పాఠశాలలో ఉన్న ఒక మూత్రశాల



పాఠశాలలో నిలిచిన మురుగు నీరు

రోడ్లపై పశువులు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని అంతర్గత రోడ్లతో పాటు జాతీయ రహదారులపై అనే సంఖ్యలో పశువులు సంచరిస్తున్నాయి. దీంతో నిత్యం ఆవులు అడ్డు రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని పెర్కిట్, మామిడిపల్లి, అంబేడ్కర్ చౌరస్తా, పాతబస్టాండ్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం, రాత్రి అని తేడా లేకుండా రోడ్లపై పశువులు ఉంటున్నాయి. పట్టణంలో రోజురోజుకు పశువుల సంఖ్య పెరుగుతుంది కాని తగ్గడం లేదు. అలాగే రోడ్లపై పశువులు కొట్లాడిన సమయంలో వాహనాలను ఢీకొంటున్నాయి. పట్టణంలో అసలే ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. దీనికి తోడు పశువులు రోడ్లపై ఉండటంతో వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. అధికారులు పశువుల యజమానులతో మాట్లాడి వాటిని తరలించాలని ప్రజలు కోరుతున్నారు.



పాతబస్టాండ్ సమీపంలో రోడ్లపై తిరుగుతున్న పశువులు

చర్యలు తీసుకుంటాం



రోడ్లపైకి పశువులు రాకుండా చర్యలు తీసుకుంటాం. పశువుల యజమానులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ఒక్క బూత్‌లోనే అధిక ఓటర్లు

- మిగతా బూత్‌లలో తక్కువ సంఖ్యలో..
- ఇబ్బందులు పడ్డ ఓటర్లు



వేల్పూర్‌లోని 230 నంబర్ బూత్‌లో గురువారం పోలింగ్ సమయం ముగిసిన తర్వాత ఓటర్లు

వేల్పూర్: వేల్పూర్‌లో ఉన్న ఏడు పోలింగ్ బూత్‌లలో అన్నిటికంటే ఎక్కువ ఓటర్లు 230 నంబరు బూత్‌లో ఉన్నారు. దాంతో ఓటు వేయడానికి గంటల తరబడి నిలబడాల్సి రావడంతో ఓటర్లు తీవ్ర అసహనానికి గురయ్యారు. గురువారం జరిగిన పోలింగ్‌లో వేల్పూర్‌లోని 230 నంబరు పోలింగ్ బూత్‌లో ఓటింగ్ సమయం ముగిసిన తర్వాత పురుషులు, మహిళలు కలసి సుమారు రెండు వందలకు పైగా ఓటర్లు ఓటేయడానికి వేచి ఉన్నారు. వేల్పూర్‌లో సుమారు ఐదు వేలకు పైగా ఓటర్లు ఉండడంతో ఏడు పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. ఇందులో ఆరు కేంద్రాలు ఉన్నత పాఠశాలలో, ఒక కేంద్రాన్ని మెయిన్‌రోడ్డులో ఉన్న గ్రామ పంచాయతీ భవనంలో ఏర్పాటు చేశారు. 230 కేంద్రంలో సుమారు 1300 లకు పైగా ఓటర్లు ఉండగా, మిగతా కేంద్రాలలో 800లోపు ఓటర్లు ఉన్నారు. 230 పోలింగ్ కేంద్రం కాకుండా మిగతా కేంద్రాల్లో సాయంత్రం మూడు గంటల వరకు ఓటర్లు పూర్తిగా పలుచబడ్డారు. అప్పుడప్పుడు ఒక రొకరు వస్తూ ఓటు వేసి వెళ్లారు. గ్రామ పంచాయతీలో ఉన్న 232 నంబరు కేంద్రంలో మధ్యాహ్నానికి ముందే ఓటు వేయడం దాదాపు పూర్తయింది. 230 పోలింగ్ కేంద్రంలో మాత్రం సాయంత్రం 5 దాటినా చాలామంది ఓటు వేయడానికి లైన్‌లో వేచి ఉన్నారు. అప్పటికే గంటన్నరకు పైగా వేచి ఉన్నామని అసహనానికి గురయ్యారు. గ్రామంలోని 6,7,8 వార్డులకు సంబంధించిన ఓటర్లందరినీ ఒకే బూత్‌లో చేర్చడంతో మిగతా పోలింగ్ కేంద్రాల కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పట్నుంచి వరుసగా ఎన్నికలు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అన్ని పోలింగ్ కేంద్రాల్లో సమానంగా ఓటర్లు ఉండేటట్లు మార్పులు చేయాలని, లేదా మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం





దేవతామూర్తులను ఊరేగిస్తున్న నాయక్‌పోడ్ సంఘం సభ్యులు

మోర్తాడ్: మండలంలోని ధర్మోరాలో శుక్రవారం భీమన్న ఆలయం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. గంగ నీళ్లతో అభిషేకం చేశారు. సంఘం సభ్యులు తమ కుటుంబ సభ్యులతో సహా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నెరవేరిన దశాబ్దాల కల

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని చాంద్‌మియాబాగ్‌లోని 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి చేంగల్ వరకు డబుల్ నిర్మాణం చేపట్టాలనే ఈ ప్రాంత ప్రజల కల నెరవేరింది. బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల పరిధిలో ఉన్న చాంద్‌మియాబాగ్ నుంచి చేంగల్ వరకు 15 కిలోమీటర్ల రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చడానికి రూ.23 కోట్లు మంజూరు చేశారు. సెప్టెంబర్‌లో ఈ రోడ్డు పనులను ప్రారంభించారు. రెండు నెలల్లోనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు డబుల్ రోడ్డు కోసం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు నిధులు మంజూరై పనులు పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మనోహరాబాద్ కలిగోట్ గ్రామాల మధ్య రూ.4 కోట్లతో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ వంతెన నిర్మాణంతో ప్రయాణం సులభతరంగా మారింది. వంతెన లేనప్పుడు ప్రతియేటా వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయేవి. ప్రస్తుతం వంతెన కష్టాలు తీరాయి. ప్రస్తుతం చాంద్‌మియాబాగ్ నుంచి చేంగల్ వరకు డబుల్ నిర్మాణం పూర్తయ్యింది. అక్కడక్కడ సీసీ కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. వంతెనతో పాటు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి కావడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – సామ్ బహదూర్ (హిందీ)- 03.00, 10.10; యానిమల్ (తెలుగు)-6.10
- స్క్రీన్-2 – యానిమల్ (తెలుగు)- 09.00, 1.00, 5.00, 9.00
- స్క్రీన్-3 – యానిమల్ (తెలుగు)- 10.00, 2.00, 6.00, 10.10; మంగళవారం (తెలుగు)- 4.00
- స్క్రీన్-4 – కాలింగ్ సహస్ర (తెలుగు)- 01.15, ఉపేంద్రగాడి అడ్డా (తెలుగు) 4.20, అథర్వ (తెలుగు) - 7.10, విక్రమ్‌రాథోడ్ (తెలుగు) 9.45